క్లుప్తంగా

వక్ఫ్ సవరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ



హన్మకొండ చౌరస్తా: పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన వక్ఫ్‌బోర్డు –2024 సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ మిల్లత్ రాబ్త కమిటీ హనుమకొండ ఆధ్వర్యంలో ఉత్తరాలు రాయడంతో పాటు, సంతకాల సేకరణ చేపట్టారు. అబ్దుల్ నబీషా దర్గా ఆవరణలో గురువారం జరిగిన కార్యక్రమంలో దర్గా పీఠాధిపతి ఉమర్ అలిఫా ఖాదిరి మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును విరమించుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నయీమొద్దీన్, డాక్టర్ రాజీమహ్మద్, తస్లీంఖాన్, అబ్దుల్లాఖాన్ అఫ్జల్, యాకూబ్, రజాక్, ఫిరోజ్, షైదర్, ఇమాం, అలీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కేయూలోని గణితశాస్త్ర విభాగం పరిశోధకుడు వెంకటేశ్వరరావు బురుగుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. స్టడీస్ ఆఫ్ వేవ్ ప్రొఫగేషన్ ప్రాబ్లెమ్స్ ఇన్ ఎలాస్టిక్ సాలిడ్స్ అనే అంశంపై గణిత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ సోమయ్య పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి వెంకటేశ్వర రావుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు.

వర్షాలకు కూలిన పెంకుటిల్లు



కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురి వాటర్ ట్యాంక్ సమీపంలో శిథిలావస్థకు చేరిన ఓ పెంకుటిల్లు గురువారం తెల్లవారు జామున నెలకూలిన ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఠాకూర్ రాజేందర్ సింగ్ అనే వృద్ధుడు తన కుటుంబ సభ్యులతో కలిసి పెంకుటింట్లో ఉంటున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ ఇల్లు తడిసి తెల్లవారు జామున కూలడంతో లోపల నిద్రిస్తున్న ఠాకూర్ అనసూర్యతో పాటు రాజేందర్ సింగ్ గాయపడ్డారు. క్షతగాత్రులను కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రిలో చేర్పించారు. కూలిన ఇంటిని అధికారులు పరిశీలించి ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

ఏచూరి మరణం విప్లవోద్యమానికి తీరని లోటు

రామన్నపేట: భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం భారత విప్లవ ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం వరంగల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు బాబు అన్నారు. రామన్నపేట ఏరియా కమిటీ తరఫున పార్టీ కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి కొల్లోజు రమేష్, దామెర శ్రీనివాస్, కందుకూరి రమేష్, గాలయ్య, శివ, బాబు, కుమార్, సంపత్, కిరణ్, రవి, ఎలిషా, తదితరులు పాల్గొన్నారు.

ఖిలా వరంగల్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సీఐటీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు సాగర్, నాయకులు సంతాప వ్యక్తం చేశారు. పార్టీకి ఏచూరి అందించిన సేవలను కొనియాడారు. వరంగల్ రైల్వే గేట్ ప్రాంతంలో జరిగిన వేదికపై ఆయనతో పంచుకున్న అనుభవాలను సాగర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

మెడికవర్‌లో మెడ రక్త నాళానికి అరుదైన శస్త్ర చికిత్స

కాజీపేట అర్బన్: హనుమకొండ హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో 64 ఏళ్ల వృద్ధుడికి మెడ రక్తనాళానికి కరోటిడ్ ఆర్టరీ స్టెంటింగ్ అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. ఈమేరకు ఆస్పత్రి ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇంటర్నేషనల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ సంజయ్ కరింవార్, న్యూరాలజిస్ట్ డాక్టర్ అనిరుద్ దేశ్‌పాండే వివరాలు వెల్లడించారు. వరంగల్‌కు చెందిన నల్లా రాజేందర్ కరోటిడ్ ఆర్టరీ స్టెంటింగ్ అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించినట్లు వివరించారు.

ఆర్‌ఎంపీలపై దాడులు సరికాదు

ఖిలా వరంగల్: ఆర్‌ఎంపీ, పీఎంపీలపై వైద్య మండలి అధికారులు చేపడుతున్న దాడులు సరికాదని, వాటిని తక్షణమే నిలిపివేయాలని ఆర్‌ఎంపీ, పీఎంపీల సంఘ జిల్లా అధ్యక్షుడు నరేంద్రు శ్రీనివాస్, కార్యదర్శి కంచె రాజేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దిడ్డి సురేష్, మండల అధ్యక్షుడు రామగోని శ్యాంప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు పడమరకోట జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు గురువారం ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావుకు వినతిప్రతం అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దామోదర్ యాదవ్, ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఇంజపూరి సుధాకర్, బండారి రాజేంద్ర ప్రసాద్, బేతి మహేందర్, వెంకటేష్, దేవురుప్పల రమేష్, రామకృష్ణ, శ్రీనివాస్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇదీ.. ఇచ్చుళ్లపల్లి రోడ్డు

- ఏళ్లుగా మట్టిరోడ్డే దిక్కు
- ఇటీవల వర్షాలకు భారీగా గుంతలు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న పల్లె ప్రజలు



ఇచ్చుళ్లపల్లి నుంచి కన్నారానికి వెళ్లే మట్టిరోడ్డు

వేలేరు : గ్రామాల అభివృద్ధి కోసం అనేక నిధులు కేటాయిస్తున్నామని ప్రభుత్వాలు పదేపదే చెబుతున్నా వివిధ పల్లెలకు కనీసం రోడ్డు సౌకర్యం కల్పించడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సరైన రోడ్డు సౌకర్యం లేక ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నామని పల్లె ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మట్టిరోడ్డే దిక్కవడంతో రవాణా కష్టాలు తప్పడం లేదని మండలంలోని కన్నారం శివారులో గల ఇచ్చుళ్లపల్లి వాసులు వాపోతున్నారు. ఇచ్చుళ్లపల్లి నుంచి నిత్యం కన్నారం, ఇతర గ్రామాలకు వెళ్లాలంటే విద్యార్థులు, స్థానికులు మట్టిరోడ్డులో ప్రయాణిస్తూ విసుగు చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక వర్షాకాలంలో అయితే మట్టిరోడ్డుపై గుంతలు ఏర్పడడంతో ప్రయాణించాలంటే భయాందోళన చెందుతున్నామని అంటున్నారు. అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లాలంటే పాట్లు తప్పడం లేదని ఇచ్చుళ్లపల్లి స్థానికులు వాపోతున్నారు. అయితే ఈ పల్లె దుస్థితిని గత ప్రభుత్వ హయంలో అప్పటి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ దృష్టికి గ్రామస్తులు పలుమార్లు తీసుకువెళ్లినా బీటీ రోడ్డుకు మోక్షం కలుగలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం హుస్నాబాద్ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టి సారించి బీటిరోడ్డు మంజూరు చేయాలని కోరుతున్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

రోడ్డు సౌకర్యం కల్పించాలని కొన్ని ఏళ్లుగా అధికారులకు, నాయకులకు విన్నవించాం. ఎన్నికలప్పుడు వచ్చి రోడ్డు సౌకర్యం కల్పిస్తాం అని చెప్పి ఎన్నికలయ్యాక ఇటు వైపు రావడమే లేదు. వర్షాకాలంలో మట్టి రోడ్డుపై గుంతలుపడి దారిగుండా వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బీటీరోడ్డు నిర్మించి రవాణా సౌకర్యం కల్పించాలి.

- వేల్పుల రవి, గ్రామస్తుడు, ఇచ్చుళ్లపల్లి

గణేశ్ నిమజ్జనంలో నిర్లక్ష్యం వహించొద్దు



ఆత్మకూరు : నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీపీఓ లక్ష్మీరమాకాంత్



కమలాపూర్ : పెద్ద చెరువును పరిశీలిస్తున్న ఏసీపీ తిరుమల్

ఆత్మకూరు : గణపతి విగ్రహాలు నిమజ్జనం చేసే సమయంలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్ మండల పంచాయతీ అధికారులను ఆదేశించారు. గురువారం కటాక్షపూర్ చెరువును ఆయన పరిశీలించి వినాయక నిమజ్జన కోసం చేస్తున్న ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గణేశ్ నిమజ్జనానికి వచ్చిన భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని అన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించి నిమజ్జనాన్ని విజయవంతం చేయాలని అన్నారు. అనంతరం హౌజ్‌బుజుర్గు గ్రామాన్ని పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. పన్నుల వసూలుపై పలు సూచనలు చేశారు. డీఎల్‌పీఓ షర్ఫొద్దీన్, ఎంపీఓ విమల, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

కమలాపూర్ : నవరాత్రుల అనంతరం గణపతి నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కాజీపేట ఏసీపీ తిరుమల్ సూచించారు. గణపతి నిమజ్జనాల కోసం స్థానిక సీఐ హరికృష్ణతో కలిసి గురువారం ఆయన మండల కేంద్రంలోని పెద్ద చెరువును పరిశీలించారు. ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని సూచించారు. మండల ప్రజలు, భక్తులు తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. పెద్ద చెరువుతోపాటు మండలంలోని చెరువులు, కుంటలు, వాగులు పూర్తిస్థాయిలో నీటితో నిండిపోయి ఉన్నందున నిమజ్జన ప్రదేశాల వద్దకు చిన్నారులు వెళ్లకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు.

పరకాల : గణేశ్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు, భక్తులు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోనున్నట్లు పరకాల ఆర్డీఓ నారాయణ, వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ అన్నారు. గణేశ్ నిమజ్జనం చేసే చలివాగు ప్రాంతాన్ని గురువారం సందర్శించారు. ఏర్పాట్ల గురించి మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహను అడిగి తెలుసుకున్నారు. చెరువు వద్ద సిబ్బంది నియామకంతో పాటు లైటింగ్ సదుపాయం, నిమజ్జనానికి వినియోగించేందుకు క్రేన్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఏసీపీ కిశోర్‌కుమార్, సీఐ క్రాంతికుమార్, తహసీల్దార్ భాస్కర్, ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, ఎంపీడీఓ ఆంజనేయులు ఉన్నారు.

'రేవూరి'ని కలిసిన మార్కెట్ నూతన కమిటీ



పరకాల : వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ సభ్యులు గురువారం స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. చైర్మన్‌గా నియామకమైన చందుపట్ల రాజిరెడ్డితో పాటు వైస్ చైర్మన్ రవీందర్, డైరెక్టర్‌లు రుద్రమదేవి, కుమార్, రాజయ్య, కుమారస్వామి, భిక్షపతి, విజయ్‌కుమార్, కమల, రంజాన్, వెంకటరాజిరెడ్డి, కుమారస్వామి, సునీత, స్వామిరావు కలిసినవారిలో ఉన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో చండీహోమం

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున కాశీ విశ్వేశ్వరుడికి అర్చకులు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ఆవరణలోని యాగశాలలో చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాల్లో మండల శ్రీరాములు, ముచ్చర్ల ప్రభాకర్, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రెవెన్యూ సిబ్బంది శ్రమదానం



శాయంపేట : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగడంతో రెవెన్యూ సిబ్బంది శ్రమదానం చేసి చెట్లను తొలగించారు.

'ఏచూరి' మృతి తీరనిలోటు

ఐనవోలు : సీపీఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు, వామపక్ష ఉద్యమానికి తీరనిలోటని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏచూరి విద్యార్థి దశలో ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ కార్యదర్శిగా, సీపీఎం నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై నట్లు తెలిపారు. అనంతరం సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి ప్రజల పక్షాన పోరాడారని గుర్తు చేశారు.

పరకాలలో..

పరకాల : సీపీఎం సీనియర్ నేత సీతారాం ఏచూరి మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు తిరుపతి అన్నారు. పట్టణంలోని అమరధామంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పరకాల జేఏసీ నాయకులతో కలిసి నివాళులర్పించారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు



ఐనవోలు : మండలంలోని నందనం, కక్కిరాలపల్లి, వెంకటాపూర్, పున్నేలు ఉన్నత పాఠశాలల్లో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రాజు గురువారం చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని అన్నారు. డైట్ లెక్చరర్లు, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, కార్యదర్శి శ్రీనివాస్, మండల బాధ్యుడు బ్రహ్మచారి, నర్సింహచార్యులు, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపెద్దలపై చర్య తీసుకోవాలి

కమలాపూర్ : డప్పు కొట్టేందుకు రావడం వీలు కాదని చెప్పిన దళిత కుటుంబాన్ని గ్రామం నుంచి బహిష్కరించడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్కటి జనార్దన్ గురువారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. మెదక్ జిల్లా మనోహరబాద్ మండలం గోతోజిగూడెంలో పంచమి శంకరయ్య మృతిచెందిన అనంతరం అతని కుమారుడు ఓ కంపెనీలో పనిచేస్తుండగా, మరో కుమారుడు జేఎన్‌టీయూలో ఉన్నత విద్యనభ్యసిస్తున్నాడని తెలిపారు. దళిత విద్యార్థి చదువుకోవడాన్ని జీర్ణించుకోలేని కొందరు గ్రామ పెద్దలు కక్షతో వెలివేయడం సిగ్గుచేటని తెలిపారు. ఆ కుటుంబ సభ్యులతో ఎవరు మాట్లాడినా వారిని కూడా వెలివేస్తామని ప్రకటించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

దాడి చేయడం సరికాదు

వేలేరు : బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇంటిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని ఆ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు గొవింద సురేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ, ఫిరాయింపులకు పాలడిన ఎమ్మెల్యేలను నిలదీస్తున్నందుకే కాంగ్రెస్ కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు.

గణపతి మండపాల్లో అన్నదానం



ఆత్మకూరు : అన్నదానంలో పాల్గొన్న భక్తులు



ఎల్కతుర్తి : పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఆయా మండపాల వద్ద ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదానం చేపట్టారు.

ఎల్కతుర్తి : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

మిత్రుల ఔదార్యం

దుగ్గొండి: మండలంలోని నాచినపల్లి గ్రామానికి చెందిన యాట విజయ 10 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ మేరకు ఆమె కుమారుడు శ్రీను, కూతురు సుమలతల టెన్త్ బ్యాచ్ మిత్రులంతా(2003–04) కలిసి రూ.19,000 బాధిత కుటుంబానికి అందించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఎలాంటి ఆపద వచ్చిన తెలపాలని ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని కోరారు.

ఎస్సీ, ఎస్టీ ట్రాన్స్‌కో ఉద్యోగుల నిరసన

రాయపర్తి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల జాక్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు బదులుగా మెరిట్ కం సీనియారిటీ విధానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.

అకారణంగా యువకుడిపై దాడి

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ వైఎస్సార్ నగర్ కాలనీలో ఓ యువకుడిపై కొంతమంది వ్యక్తులు బుధవారం రాత్రి దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. కొమ్ము కార్తీక్ రాత్రి ఇంటికి వెళ్తుండగా చీకట్లో మద్యం మత్తులో ఉన్న స్థానిక యువకులు అతన్ని అడ్డుకుని దాడి చేశారు. కార్తీక్ జేబులో ఉన్న రూ.30 వేలను గుంజుకోవడానికి సదరు యువకులు ప్రయత్నించగా ఘర్షణ జరిగింది. కార్తీక్ ఎదురు తిరగడాన్ని జీర్ణించుకోలేకపోయిన ఆ యువకులు తమ చేతిలో ఉన్న కత్తితో దాడి చేయగా చెవి నుంచి గొంతు వరకు తెగిపోయింది. కడుపులో కత్తి గుచ్చుకోవడంతో తీవ్ర గాయం అయింది. విషయం తెలుసుకున్న కార్తీక్ కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన కార్తీక్‌ను ఆస్పత్రిలో చేర్పించగా వైద్యులు దాదాపు 14 కుట్లు వేసి చికిత్స అందించారు. పరిస్థితిని పోలీసులు సమీక్షించి దర్యాప్తు చేస్తున్నారు. ఈ గొడవకు అసలు కారణం యువకులు గంజాయి మత్తులో ఉండటమేనని పట్టణంలో ప్రచారం జరుగుతోంది.

విద్యార్థులు ఇష్టపడి చదివి లక్ష్యాన్ని ఛేదించాలి



మాట్లాడుతున్న డాక్టర్ ప్రహసిత్

ఆత్మకూరు : విద్యార్థులు ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యం ఛేదించవచ్చని మానసిక వైద్య నిపుణుడు ప్రహసిత్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు గురువారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ వారోత్సవాల సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆత్మహత్యకు అత్యంత సాధారణ కారణాలను వివరించారు. మనోధైర్యంతో ముందుకు సాగితే ఎంతటి సమస్య అయిన తొలిగిపోతుందని అన్నారు. ఆత్మహత్య చేసుకునే ఆలోచన మనసులో రానివ్వకూడదని, ఒత్తిడిని తట్టుకునే శక్తిని అలవర్చుకోవాలని అన్నారు. విద్యార్థి దశ నుంచే ఒత్తిడిని జయించడం నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీఎస్ రెడ్డి, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలి

- సఖి కేస్ వర్కర్ వినీల



మాట్లాడుతున్న కేస్ వర్కర్ వినీల

శాయంపేట : చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సఖి కేస్ వర్కర్ వినీల అన్నారు. మండల కేంద్రంలో సఖి వన్ స్టాప్ సెంటర్, మహిళా చట్టాలపై గురువారం ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఫీల్డ్ ఫెసిలిటర్ కల్పన అధ్యక్షతన గురువారం అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా, శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో సఖి సెంటర్ కొనసాగుతోందని అన్నారు. బాధిత మహిళలకు కౌన్సిలింగ్, వైద్య, పోలీసు, న్యాయ సహాయం, తాత్కాలిక వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. గృహహింస, లైగింక వేధింపులు, అత్యాచారాల నుంచి రక్షణ కల్పించేందుకు సఖి సెంటర్ 24గంటలు పని చేస్తోందని అన్నారు. బాధిత మహిళలు సాయం పొందేందుకు 181 టోల్ ఫ్రీ నంబర్‌కు 08702452112,7382983088 నంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందాలని తెలిపారు. ఈ సమావేశంలో పారామెడికల్ కరుణ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, మహిళలు

దామెర : మండలంలోని మహిళలు, గర్భిణులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి సూచించారు. సింగరాజుపల్లిలో పోషణమాసం కార్యక్రమంలో భాగంగా గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలంటే పోషక పదార్థాలు కలిగిన ఆహారం తీసుకోవాలని అన్నారు. అనంతరం వెల్‌బేబీ షో నిర్వహించి బహుమతులు అందించారు. ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన కోసం కృషిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రజిత, అంగన్‌వాడీ సిబ్బంది వాణి, శోభ, కోమల, రమ, లావణ్య, ఆశ, శకుంతల, నిరీక్షణ, సిరి గ్రామైఖ్య సంఘం సభ్యులు, తల్లులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో ఎంజేపీ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

కమలాపూర్ : ఈనెల 10వ తేదీన హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో కమలాపూర్ మండల కేంద్రంలోని ఎంజేపీ గురుకుల కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఒక గోల్డ్ మెడల్, మూడు సిల్వర్ మెడల్స్, ఆరు బ్రొంజ్ మెడల్స్ సాధించినట్లు ప్రిన్సిపాల్ పి.కవితారెడ్డి గురువారం తెలిపారు. అండర్–18 విభాగంలో 1500 మీటర్ల పరుగుపందెంలో కె.శ్రీకాస్ ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించగా, జి.విజయ్‌పాల్ ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్స్ సాధించారని అన్నారు. అలాగే 1500 మీటర్ల పరుగుపందెంలో బి.సుజన్‌కాంత్, 3 కిలోమీటర్ల పరుగు పందెం, జావెలిన్ త్రోలో కె.ప్రణయ్, అండర్–20 విభాగం జావెలిన్ త్రోలో జి.రాకేష్, డిస్కస్ త్రోలో ఎ.రాజ్‌కుమార్, 100 మీటర్ల పరుగుపందెంలో ఒ.సత్తిబాబు తృతీయ స్థానంలో నిలిచి బ్రొంజ్ మెడల్స్ సాధించినట్లు వెల్లడించారు. అలాగే షాట్ పుట్, డిస్కస్ గ్రోలో జి.రాకేష్ సిల్వర్ మెడల్స్ సాధించినట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో అత్యంత ప్రతిభ కనబర్చి పతకాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ సంతోష్ అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఐనవోలు : రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు వెంకటాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం రమేశ్ తెలిపారు. పాఠశాలకు చెందిన రేవతి, భానుశ్రీ, రిషి జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కాగా గురువారం విద్యార్థులతో పాటు ఫిజికల్ డైరక్టర్ సుమలతను పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. ఈనెల 13 నుంచి 15 వరకు నిర్మల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.

సార్వత్రిక విద్యను వినియోగించుకోవాలి



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న శంకర్‌రావు

పరకాల : సార్వత్రిక విద్య ఎంతో సులభమైందని వరంగల్ ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్స్ కో ఆర్డినేటర్ మురాల శంకర్‌రావు అన్నారు. గురువారం ఎస్వీ కళాశాలలో తెలంగాణ ఓపెన్ పదోతరగతి, ఇంటర్ ప్రవేశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రవేశాలకు అపరాధ రుసుము రూ.100 అని, ఎస్‌ఎస్‌సీకి, ఇంటర్‌కు రూ.200 ఉంటుందని, అక్టోబర్ 3 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎస్వీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిరికొండ శ్రీనివాసాచారి తెలిపారు. వివరాలకు అసిస్టెంట్ కోఆర్డినేటర్, వైస్ ప్రిన్సిపాల్ శివాజీ గణేశ్ (9949143485), సూర సతీష్(8074039942)ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మధుసూదన్, సతీష్, రవికుమార్, హబీబ్, యశోద, శ్రీలత, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వం పొంది అండగా నిలవాలి



మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

పరకాల : ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న బీజేపీకి సభ్యత్వంతో అండగా నిలవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు గురుప్రసాద్, మేఘనాథ్ పాల్గొన్నారు.